క్లుప్తంగా

విత్తనశుద్ధిపై అవగాహన



రైతులచే సామూహిక విత్తనశుద్ధి చేయిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలంలోని ధూళికుప్ప గ్రామంలో ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది బీజామృతం ఎరువుతో సామూహిక విత్తనశుద్ధి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 20 మంది రైతులచే వరి విత్తనాలను విత్తన శుద్ధి చేయించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది ఎ.అన్నపూర్ణ, నరేష్ మాట్లాడుతూ విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవడం వలన విత్తనాలకు మొలకెత్తే శాతం పెరుగుతుందన్నారు. విత్తనాలకు హాని కలుగజేసే నేలలోని సూక్ష్మజీవులను నివారిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంటీ గోరిశెట్టి నిర్మలాదేవి పాల్గొన్నారు.

చురుగ్గా భూ రీసర్వే



రోవర్‌తో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వే ప్రక్రియను భూ యజమానులు, హక్కుదారులు, రైతులు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలో సర్వే నంబర్ 320 నుంచి 375 మధ్య ఉన్న వివిధ రకాల తోటలు, పంట భూముల్లో శుక్రవారం రీసర్వే నిర్వహించారు. రోవర్ యంత్రంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఈ సర్వే నిర్వహించారు. మండల పరిధిలో టీడీ పారాపురంలో జగన్న శాశ్వత భూ హక్కు, రక్షణ పథకంలో భాగంగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో భూ హక్కుదారులు, రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్వోలు బి.సాయిశ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు జి.గణేష్, నాగరాజు, మణికుమార్ పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను గుర్తించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ బి.జనార్దననాయుడు అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు, అమ్మ ఒడి పథకం, జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీ, డ్రాపౌట్స్ వంటి వివరాలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఉపాధ్యాయులు అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి, సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. అలాగే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. సమావేశంలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పి.దేవానంద్, సీఆర్పీలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలోకి...



ఇంటికి వెళ్లి పిల్లలను మోటివేషన్ చేస్తున్న పీఎంఆర్‌సీ సిబ్బంది

సీతంపేట: బడి బయట పిల్లలను బడిలో చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు స్థానిక పీఎంఆర్‌సీ సిబ్బంది. ఏఎంవో పి.కోటిబాబు, జీసీడీవో రాములమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించారు. శ్రీరాములుగూడకు చెందిన ఇద్దరు విద్యార్థినులు చదువుకోకుండా ఇంటివద్దే ఉండడంతో వారి ఇంటికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మోటివేషన్ చేశారు. ఎస్.నందిని, ఎస్.రోజాలను ఆరో తరగతిలో హడ్డుబంగిలో చేర్పించారు.

అమ్మ ఒడితో ఆసరా..

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



భామిని: అమ్మ ఒడి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని బాలేరులో జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అమ్మ ఒడి నాల్గో విడత నిధుల చెక్కుల అందజేత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో 7,443 మంది విద్యార్థులకు సంబంధించి రూ.5.63 కోట్ల చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆకాంక్షతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే విద్యకు సంబంధించి అమ్మ ఒడితో పాటు విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి వినూత్న పథకాలు తెచ్చి పిల్లల విద్యాభ్యాసం బాధ్యతను ప్రభుత్వం చేపట్టిందన్నారు. దేశంలోనే ఇది అందరి దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో భామిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కె.సాత్విక, ఈశ్వరమ్మ ఆంగ్లంలో చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, ఎంపీడీవో చంద్రరావు, ఎంఈఓలు శ్రీనివాసరావు, భాస్కరరావు, ప్రిన్సిపాల్ శివకుమార్, హెచ్‌ఎం జామి రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా...

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యాబోధన అందుబాటులోకి తీసుకువచ్చారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో మండలంలోని రూ.7 కోట్ల 70లక్షల అమ్మ ఒడి నమూనా చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు వరమన్నారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఒక లక్ష్యంతో చదివితే విజయం తథ్యమన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పాఠశాల విద్య తరువాత ఉన్నత విద్యనందించడానికి డిగ్రీ కళాశాలలు, అలాగే సీతంపేట వంటి ప్రాంతాల్లో ఇటీవల నైపుణ్య కళాశాల కూడా మంజూరైందన్నారు.



సీతంపేట: నమూన చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పీవో కల్పనాకుమారి

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదువులు మధ్యలో మాన్పించకుండా రెగ్యులర్‌గా స్కూల్‌కు పంపించాలన్నారు. విద్యార్థులు హిందీ, ఆంగ్లం, తెలుగులో అమ్మ ఒడి పథకం గూర్చి అద్భుతంగా మాట్లాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మెన్ హెచ్.మోహన్‌రావు, డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఎంఈవో ఆనందరావు, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గొంతు వాపు వ్యాధిపై తస్మాత్..

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పశు వైద్యాధికారి లక్ష్మణరావు



ఆరుబయట మేత మేస్తున్న పశువులు

గుమ్మలక్ష్మీపురం: పశువుల్లో వచ్చే గొంతువాపు వ్యాధి విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. తొలకరి వర్షాలు పడినప్పుడు సహజంగానే పశువులకు అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వర్షాకాలం ప్రారంభంలో పశువులకు వచ్చే వ్యాధుల్లో ప్రధానమైనది గొంతు వాపు వ్యాధి. పశువులు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో వ్యాధి లక్షణాలు నివారణ చర్యలు పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గొరడ పశు వైద్యాధికారి పి.లక్ష్మణరావు వివరించారు.

వ్యాధి ఇలా వస్తుంది.

గొంతు వ్యాధి ప్రాణాంతకమైనది. పాస్టురెల్లా మల్టోసిడా అనే బాక్టీరియా సూక్ష్మజీవి వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. పల్లపు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచి ఉండే ప్రదేశాల్లో మేతకు వెళ్లే పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. బలహీనంగా ఉన్న పశువులకు త్వరగా సోకుంది. దీన్ని గురక వ్యాధి, లేక కణత వాపు వ్యాధి అని కూడా అంటారు.

వ్యాధి లక్షణాలు

పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చేటప్పుడు గురక శబ్దం వినిపిస్తుంది. నాలుక బయటకు తీస్తూ శ్వాస తీస్తుంది. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. వ్యాధి సోకిన పశువు గొంతు పైభాగాన, మెడ వాపు వస్తుంది. కళ్ల ఎర్రబడి నీరు కారుతూ ఉంటాయి. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోతుంది. వ్యాధి సోకిన 24 గంటల్లోగా చికిత్స చేయించకుంటే పశువు చనిపోతుంది.

నివారణ ఇలా..

జూన్, జూలై నెలల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే పశు వైద్యాధికారికి చూపించాలి. వ్యాధి సోకిన పశువులకు సల్ఫాడిమిడిన్ మందును నరం ద్వారా ఇవ్వాలి. ఐదు నెలల వయస్సు కలిగిన దూడలకు మొదటిసారి టీకా వేయించాలి. మరో 30 రోజులకు బూస్టర్ డోస్ వేయాలి. ఏటా ముందుగానే టీకా వేయిస్తే గొంతువాపు వ్యాధిని నిరోధించవచ్చు. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేయాలి. పాకలను, షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. ఈ వ్యాధితో పశువు చనిపోతే ఊరికి దూరంగా గొయ్యి తీసి, సున్నం వేసి పూడ్చి పెట్టాలి.

బాలికలకు పౌష్టికాహారం పంపిణీ



బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్న కౌన్సిలర్లు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని నాగవంశపు వీధి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బాలికలకు ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం శుక్రవారం అందించారు. వార్డు కౌన్సిలర్లు కె.లక్ష్మి, పల్లా భాను ఆధ్వర్యంలో 14 నుంచి 18 ఏళ్ల చిన్నారులకు మూడు కేజీల ఫైన్ బియ్యం, కందిపప్పు, ఆయిల్ అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికల కోసం కొత్తగా ఈ పథకం ద్వారా బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, బాలికల తల్లులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలి : పీవో



ఈఈ సింహచలంకు సూచనలిస్తున్న పీవో కల్పనాకుమారి

భామిని: ప్రభుత్వ భవన నిర్మాణాలు తక్షణమే పూర్తి చేసి ప్రారంభించాలని ఐటీడీఏ పీవో పి.కల్పనాకుమారి ఆదేశించారు. భామిని, బొడ్డగూడ, నల్లరాయిగూడ, బాలేరు ఆర్‌బీకేలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పలు సూచనలు చేశారు. భామినిలో సుమారు రూ.8కోట్లతో నిర్మిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల భవనాలను ఆమె సందర్శించారు. వచ్చే నెలలోగా పనులు పూర్తి చేసి అందివ్వాలని ఈఈ సింహాచలాన్ని ఆదేశించారు. బాలేరులో 49 జగనన్న హౌసింగ్ లేఅవుట్ల సమస్య పరిష్కరించి పట్టాలిచ్చిన లబ్ధిదారులకు అందివ్వాలని హౌసింగ్ పీడీ తమ్మినేని రమేష్, డీటీ నిమ్మల శేఖరంను సూచించారు. సమస్యలు సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావును ఆదేశించారు. వీఈవోను జియో ట్యాగింగ్ చేసి పంపేందుకు పలు సూచనలు చేశారు. భామినిలో 19 జగనన్న లేఅవుట్ల వద్ద తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, పీఆర్ ఏఈ గౌరీశంకర్‌ను ఆదేశించారు. సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు మంజూరును పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో చంద్రరావు, ఇంజినీరింగ్ అధికారులు, లబ్ధిదారులు టున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వంటకాల రుచిని పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం 2ను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం తయారు చేసే వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు గుడ్డు, పాలు, ఆకు కూరలతో భోజనం అందిస్తున్నట్టు తెలిపారు. ఆమె వెంట వెల్ఫేర్ అసిస్టెంట్ టి.మన్మధరావు, మహిళా పోలీసు జి.భవాని, అంగన్‌వాడీ వర్కర్ పి.కృష్ణవేణి ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై స్పందించాలి



ధర్నా పోస్టర్లను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఆ సంఘ జిల్లా కమిటీ కార్యదర్శి ఎన్.హిమప్రభ కోరారు. సీఐటీయూ నాయకులు దావాల రమణారావు నేతృత్వంలో ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా కేంద్రంలో తలపెట్టదలచిన ధర్నాకు సంబంధించిన పోస్టర్లు శుక్రవారం విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, సిబ్బందికి సంక్షేమ పథకాల వర్తింపు, సర్వీసులో ఉంటూ మరణించిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు జి.జెస్సీబాయి, జి.శారద, రజిని, పద్మావతి, పి.శారద, కాదరాము తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరితో కలసి పలు శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రజల్లో వ్యాధులపై మరింత అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర సిబ్బంది అంకితభావంతో గ్రామీణ ప్రజలకు విధానపరమైన సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ శాఖలు వారి పరిధిలో రక్షిత పథకాలను ప్రతి 15 రోజులకు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్, పైపులైన్ల లీకులపై దృష్టి పెట్టాలన్నారు. మురుగు నీరు నిల్వల్లో వృద్ధి చెందే దోమల నివారణ, మలేరియా, డెంగీ, అతిసార వంటి రోగాలను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. సమావేశంలో వైద్యాధికారులు కె.చిరంజీవి, వి.కమల్‌నాథ్, డొంక త్రినాథులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ



ఆడిట్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ కె.సన్యాసిరాజు

కురుపాం: సామాజిక తనిఖీలను ఆడిట్ సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధి హామీ అంబుడ్స్‌మన్ కె.సన్యాసిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కురుపాం మండలంలోని 23 పంచాయతీల్లో పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ శాఖల ఆధ్వర్యంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై ఆడిట్ నిర్వహించేందుకు వచ్చిన ఆడిట్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మన్ సన్యాసిరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పనులను పరిశీలించి పారదర్శకంగా నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ప్రజలు ఆడిట్ బృందం సభ్యులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీ టి.వి.ఎస్.స్వామియాజులు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, శెట్టి నాగేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో బావాజీ, ఆడిట్ ఎస్‌ఆర్‌పీ గోవిందరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యం

సీతంపేట: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.సత్యం అన్నారు. వైద్య సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు వస్తే వెంటనే ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న వైద్యాధికారి రవీంద్ర

భామిని: పంచాయతీలో అనారోగ్యాలకు కారణలైన దోమల నివారణకు చర్యలు చేపట్టాలని బత్తిలి, భామిని వైద్యాధికారులు కొండపల్లి రవీంద్ర, పసుపులేటి సోయల్ అన్నారు. ఎంపీడీఓ జి.చంద్రరావు అధ్యక్షతన కార్యదర్శులకు శుక్రవారం నిర్వహించిన పారిశుద్ధ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రైడే విధిగా పాటించాలన్నారు. మురుగు నీరు నిలువ లేకుండా తరలింపు, నీటి నిలువల తొలగింపుపై చేపట్టాల్సిన చర్యలు వివరించారు. దోమల నివారణ మందుల పిచికారీ, ఫ్యాగింగ్ చేయించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, ఈవోపీఆర్‌డీ జి.కృష్ణారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా ఎనలేని గుర్తింపు




బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సన్మానిస్తున్న అంపిలి, అన్నవరం ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్:

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సచివాలయ వ్యవస్థల్లో ఉద్యోగులుగా పని చేయటం తమకు ఎనలేని గుర్తింపు ఇచ్చిందని సన్మాన గ్రహీతలు పేర్కొన్నారు. మండలంలోని అంపిలి సచివాలయం నుండి బదిలీపై వెళ్లిన శ్రీకాంత్, వేదలక్ష్మి, వెంకటేష్‌లను ఆ గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, అన్నవరం సర్పంచ్ గవర రాజశేఖర్ తదితరులు జ్ఞాపికలు అందించి సన్మానించారు. శుక్రవారం సచివాలయంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో వీరు చేసిన సేవలను కొనియాడారు. పీఏసీఎస్ అధ్యక్షుడు లోలుగు నారాయణరావు, మాజీ సర్పంచ్ గవర ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం వినతి




డీడీకి వినతిపత్రం ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు

సీతంపేట:

డీఎస్సీ 2018లో పీఈటీలుగా ఉద్యోగం పొంది రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న బీపీఈడీ అర్హత కలిగిన వారికి తక్షణమే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతులు కల్పించాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావును కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సెక్రటరీ ఎం.సాంబమూర్తి, ఎంపీ రమణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఆనంద్‌కిరణ్, డీఎస్సీ 2018 వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సురక్ష'తో అందుబాటులోకి అన్ని సేవలు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బాలేరు 1 సచివాలయం వద్ద సురక్ష కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఎన్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, ఎంపీడీవో చంద్రరావు, డీటీ శేఖరం, సొసైటీ చైర్మన్ జి.రమేష్, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ ఉషారాణి – భామిని

అందరికీ సేవలు

జగనన్న సురక్ష ద్వారా అందరికీ ప్రభుత్వ సేవలు చేరవయ్యాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని నీలమ్మ కాలనీ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు కొరికాన గంగునాయుడు, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, కొండాడ అరుణ్‌కుమార్, పల్లా భాను పాల్గొన్నారు. – పాలకొండ



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

జగనన్న సురక్షతో మేలు



శిఖబడిలో పెండింగ్ ధ్రువపత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ సీతారామయ్య, సర్పంచ్ రమేష్

జగనన్న సురక్ష కార్యక్రమంలో శిఖబడి గ్రామంలో పలు ధ్రువపత్రాలను ఇంటింటికి వెళ్లి అధికారులు అందజేస్తున్నారు. తహసీల్దార్ సీతారామయ్య, రెవెన్యూ అధికారులు గడప గడపకు వెళ్లి అందజేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. – జియ్యమ్మవలస

143 మందికి ధ్రువపత్రాల పంపిణీ

చాపరాయి బిన్నిడి గ్రామ సచివాలయంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో దుడ్డుఖల్లు గ్రామ సచివాలయంలో తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 143 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. డీఆర్‌డీఏ ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి సత్యంనాయుడు పాల్గొన్నారు. – గుమ్మలక్ష్మీపురం



చాపరాయి బిన్నిడిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి సత్యంనాయుడు